క్లుప్తంగా

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



ఫోన్ అందజేస్తున్న ఏఎస్సై బీకేపీ రావు

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెంకు చెందిన యండ్లపల్లి కిరణ్ తన సెల్‌ఫోన్‌ను ఈనెల 4వ తేదీన పోగొట్టుకోవడంతో అదే రోజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆ సెల్‌ఫోన్‌ను స్వాధీనపర్చుకుని గురువారం ఏఎస్సై బీకేపీ రావు బాధితుడికి అందజేశారు. అందుకు పోలీసులకు కిరణ్ కృతజ్ఞతలు తెలిపాడు.

నిరుపేదలకు 'ఆరోగ్యశ్రీ' సంజీవని

ఖమ్మం మామిళ్లగూడెం: నిరుపేదలకు ఆరోగ్యశ్రీ సంజీవని లాంటిదని యశోద ఆస్పత్రి సీనియర్ కేన్సర్ స్పెషలిస్ట్, హేమాటాలజిస్ట్ డాక్టర్ కంచర్ల హరీష్ తెలిపారు. గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోన్ కేన్సర్‌కు చికిత్స ఉందని, దాన్ని తొలిదశలోనే గుర్తిస్తే 90 శాతం వరకు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కేన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యాన గత రెండేళ్లుగా రెగ్యులర్ చెకప్ చేయించుకుంటూ తమ పాప ఆరోగ్యంగా ఉందని ఖమ్మం నగరానికి చెందిన నర్సింహారావు తెలిపారు. ఈ సమావేశంలో శ్రీనాథ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

హోలీ వేడుకలకు సిద్ధం

కూసుమంచి: మండలంలోని లోక్యాతండాలో హోలీ వేడుకలను మూడు రోజుల పాటు వేడుకగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో తండాలో సందడి నెలకొనగా.. శనివారం సంబరాలు ప్రారంభమై సోమవారంతో ముగియనున్నాయి. తొలిరోజు గ్రామంలోని కూడలిలో సామూహిక కోలాటం, రెండో రోజు కామదహనం అనంతరం డూండ్ వేడుకను జరుపుకోనున్నారు. చివరి రోజు రంగోలిని నిర్వహించనున్నారు.

అంగన్‌వాడీల్లో పోషణ పక్షోత్సవాలు

కూసుమంచి: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోషక విలువలు కలిగిన చిరు ధాన్యాలు, పండ్లు, కూరగాయలను ప్రదర్శించి అవగాహన కల్పించి గర్భిణులు, బాలింతలకు వాటిని అందజేశారు. పోషకాహారం తయారీ గురించి వివరించిన టీచర్లు వాటిలో లభించే పోషకాలపై అవగాహన కల్పించారు. అనంతరం పోషకాహారం తీసుకుంటామంటూ ప్రతిజ్ఞ చేయించారు.

'రాయల'కు సన్మానం

నేలకొండపల్లి: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా నియమితులైన రాయల నాగేశ్వరరావును హైదరాబాద్‌లో రాష్ట్ర మున్నూరు కాపు సంఘం నేతలు గురువారం ఘనంగా సన్మానించారు. రాజధానిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసంలో సంఘం అధ్యక్షుడు కొండా దేవయ్య ఆధ్వర్యాన రాయలకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపి జ్ఞాపికను అందించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ప్రేమలు
వినోద	ప్రేమలు
సాయిరాం	తంత్ర, షరతులు వర్తిస్తాయి!
ఆదిత్య	రజాకార్
శ్రీనివాస	భీమా
సుందర్	హనుమాన్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	3
వంకాయ	26		20
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	30		20
కాకర	36	చుక్కకూర	3
బీర	40		20
దొండ	20	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	100	గోంగూర	2
గోరుచిక్కుడు	40		10
క్యాబేజీ	26	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	20		20
ఆలుగడ్డ	30	కొత్తిమీర	1
చామగడ్డ	50		30
క్యారెట్	34	పుదీన	1
క్యాప్సికం	58		20

-ఖమ్మం వ్యవసాయం

డేంజరస్ డ్రైవింగ్..!



మైనర్లు, యువత చేస్తున్న ర్యాష్ డ్రైవింగ్ ఇతరులకు ప్రాణసంకటంగా మారింది. ఎక్కడో హైదరాబాద్ లాంటి మెట్రోపాలిటన్ నగరాలకు మాత్రమే పరిమితమైన ర్యాష్ డ్రైవింగ్, రేసింగ్‌లు, బెట్టింగ్, చాలెంజ్ డ్రైవింగ్‌ల సంస్కృతి ఖమ్మంకు రానే వచ్చింది. ఒక్క చక్రంపైనే విన్యాసాలు, అతివేగం, జిగ్‌జాగ్‌గా డ్రైవింగ్ చేస్తూ వారి ప్రాణాలతో పాటు ఎదుటివారి ప్రాణాలను సైతం ప్రమాదంలోకి నెడుతున్నారు.

– ఖమ్మంవన్‌టౌన్

బైక్‌లతో యువత హల్‌చల్

- ప్రాణసంకటంగా మారిన మైనర్ల డ్రైవింగ్
- వింత హారన్లు, వికృత విన్యాసాలు
- సహచర ప్రయాణికుల భయాందోళన
- పోలీసుల నిఘా కరువు



ప్రమాదకర ప్రయాణాలు..

వైరా రోడ్డు, మమత రోడ్డుతో పాటు నగరానికి వచ్చే ముఖ్యమైన దారులలో ద్విచక్రవాహనంపై వెళ్తున్నారా.. అయితే మీరు నిత్యం ప్రమాదపు టంచుల్లో రాకపోకలు కొనసాగిస్తున్నట్లే. మీ ప్రాణాలకు గ్యారంటీ అయితే లేదు ఎందుకంటే మీరు మీ దారిలో ప్రశాంతంగా వెళ్తున్నా.. ఎవరో ఒకరు ఆకస్మాత్తుగా వచ్చి మిమ్మల్ని ఢీకొనవచ్చు. మీ ప్రమేయం లేకుండానే మీరు అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లోకి వెళ్లొచ్చు. ఈ ప్రమాదకర పరిస్థితి నగరంలో నిత్యం ఎదురవుతూనే ఉంది.

ఆడిందే ఆట.. పాడిందే పాట

నగరంలో బైక్ రేసింగ్, ర్యాష్ డ్రైవింగ్‌ల సంస్కృతి నిత్యకృత్యమవుతుంది. ముఖ్యంగా యువత, మైనర్లు హైస్పీడ్ బైక్‌లతో వికృతస్థాయిలో విన్యాసాలు చేస్తూ చెలరేగిపోతున్నారు. గత పాలకుల కాలంలో ఖమ్మంలో యువత ఆడిందే ఆటా పాడిందే పాట అన్నచందాన తయారైంది. అదే సంస్కృతి నేటికి కొనసాగుతూనే ఉంది. 7, 8వ తరగతి చదివే పిల్లల నుంచి డిగ్రీ పిల్లల వరకు తమ తల్లిదండ్రుల వాహనాలతో పాటు వారు కొనిచ్చిన స్పోర్ట్స్ బైక్‌లపై అతివేగంగా తిరుగుతూ ప్రశాంతంగా రోడ్డుపై వెళ్తున్న వారిని ఢీకొడుతూ ప్రమాదంలోకి నెట్టేస్తున్నారు. తాము ఒక్కరిమే ఆ రోడ్డుపై తిరుగుతున్నట్లు ఊహల్లో విహరిస్తూ గాల్లోనే దూసుకెళ్తూ ఎదుటి వారి ప్రాణాలకు గ్యారంటీ లేకుండా చేస్తున్నారు.



ఉలిక్కిపడేలా హారన్లు..

యువత, మైనర్లు వింత హారన్లు, వికృత చేష్టలతో జిగ్‌జాగ్‌గా డ్రైవింగ్ చేస్తున్నారు. రాయల్ ఎన్‌ఫీల్డ్, ఇతర స్పోర్ట్స్ బైక్‌లతో భయంకరమైన శబ్దం వచ్చే వాహనాలను నడుపుతూ రోడ్డుపై వెళ్తున్న వారిని అయోమయంలోకి నెడుతున్నారు. ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ వారి వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు లోనవుతున్న సందర్భాలు అనేకం లేకపోలేదు.

శబ్ద కాలుష్య కేంద్రాలుగా పేరు..

యువత, మైనర్లు చేస్తున్న విన్యాసాలతో ద్విచక్ర వాహనదారులు తాము ఇంటికి సురక్షితంగా వెళ్తామా లేదా అనే భయంతో తమ ప్రయాణాలను కొనసాగిస్తున్నారు. ప్రశాంతంగా తమ గమ్యస్థానాలకు వెళ్దాం అనుకునే వారికి ఉన్నట్టుండి వింత హారన్ శబ్దాలతో కలవరపాటుకు గురి చేస్తున్నాయి. వింత హారన్లు, ఎక్కువ సౌండ్ వచ్చే సైలెన్సర్ బైక్‌లతో మమత రోడ్డు, గొల్లగూడెం రోడ్డు, వైరా రోడ్డు, బైపాస్ రోడ్డులు శబ్దకాలుష్య ఉత్పత్తి కేంద్రాలుగా తయారు చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్న జనం..

బైక్‌పై తమ పిల్లలను పాఠశాలలో దించడం.. తిరిగి తీసుకురావడం పెద్ద సమస్యగా మారింది. ముఖ్యంగా మమత రోడ్డులోనే అనేక పాఠశాలలు, కళాశాలలు ఉండడంతో రోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. దీనికి తోడు ఈ రోడ్డులో రెస్టారెంట్లు, వాహనాలను రిపేర్ చేసే దుకాణాలు సైతం అనేకం ఉండడంతో ఎక్కువ ట్రాఫిక్ ఉంటుంది.

కొరవడిన బాధ్యత..

తమ పిల్లలకు వాహనాలను ఇస్తున్న తల్లిదండ్రులు కొంచెం విజ్ఞతతో ఆలోచించాలి. తమ పిల్లల సరదా కోసం ఎదుటివారి ప్రాణాలతో చెలగాటమాడేలా డ్రైవింగ్ చేస్తున్న మైనర్లు, యువతకు హైస్పీడ్ వాహనాలు కొనిచ్చే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అదేవిధంగా ఎక్కడపడితే అక్కడ వాహనాలను ఆపి చలాన్లు వేస్తున్న పోలీసులు ఈ మైనర్, యూత్ ర్యాష్ డ్రైవింగ్‌లపై దృష్టి సారించాలి.

ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారు..



తమ ద్విచక్రవాహనంపై మమత రోడ్డు, వైరా రోడ్డు, బైపాస్ రోడ్లపైకి వెళ్లాలంటేనే భయం వేస్తుంది. ఎప్పుడూ ఎటు నుంచి వచ్చి ఢీకొడతారో అర్థం కావడంలేదు. హైస్పీడ్ వాహనాలు, పెద్ద శబ్దాలు చేసే వాహనాలతో రయ్ మంటూ ర్యాష్‌గా డ్రైవింగ్ చేస్తున్నారు. వీరు చేసే వింత శబ్దాలు వాహనదారులను అయోమయంలోకి నెడుతుండడంతో కిందపడిపోతున్నారు. ఈ ర్యాష్, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌ను నివారించాలి.

– బి.శృతి, వాహన చోదకురాలు, మధురానగర్

'ఉపాధి'లో కూలీల సంఖ్య పెంచండి



కూలీలతో మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ

రఘునాథపాలెం: ఉపాధి పనులకు కూలీల సంఖ్య పెంచాలని అడిషనల్ డీఆర్‌డీఓ శిరీష పేర్కొన్నారు. గురువారం మండలంలో పర్యటించి ఉపాధి హామీ పనులను పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. పంట కాల్వల్లో పూడికతీత పనులు, మస్టర్లను పరిశీలిస్తూ అసంతృప్తి వ్యక్తం చేశారు. కూలీల హాజరు శాతం చాలా తక్కువగా ఉందని, కూలీల సంఖ్యను పెంచాలన్నారు. హరితహారం నర్సరీలను సందర్శించి వేసవిలో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పద్మయ్య నాయుడు, టీఏ మదన్, ఫీల్డ్ అసిస్టెంట్ సూర్యం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

తిరుమలాయపాలెం: ఎన్నికల విధుల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రామకృష్ణ సూచించారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి బీఎల్‌ఓతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. అదే విధంగా అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులకు నిధుల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో కనీస సౌకర్యాల కల్పించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి, ప్రధానోపాధ్యాయులు, గ్రామ సమాఖ్య సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బార్ ఎన్నికల బరిలో నిలిచింది వీరే...

ఖమ్మం లీగల్: జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల వివరాలను ఎన్నికల అధికారులు గురువారం వెల్లడించారు. అధ్యక్ష పదవికి కన్నెబోయిన నాగేశ్వరరావు, నేరెళ్ల శ్రీనివాసరావు, చిలుకూరి స్వర్ణకుమారి, ప్రధాన కార్యదర్శి పదవికి కొండపల్లి శ్రీనివాస్ చౌదరి, చింతనిప్పు వెంకటేశ్వరరావు, గ్రంథాలయ కార్యదర్శి పదవికి కన్నెగంటి గోపి, దేవరకొండ కల్యాణి పోటీలో ఉన్నారని పేర్కొన్నారు. మిగతా పదవులు ఏకగ్రీవమయ్యాయని తెలిపారు. ఇందులో ఉపాధ్యక్షుడిగా కె.ఉపేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కండే వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఎజ్జగాని శ్రీనివాసరావు, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శిగా అలవాల యుగంధర్‌రావు, మహిళా ప్రతినిధిగా తన్నీరు లలిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు మారగాని శ్రీనివాసరావు, కూరపాటి శేఖర్ రాజు, రాయల పావెల్లు వివరించారు.

ఐటీడీఏ ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నెహ్రూనాయక్

తిరుమలాయపాలెం: గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఖమ్మం కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని గిరిజన సేవాలాల్ సేన పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుగులోత్ నెహ్రూనాయక్ డిమాండ్ చేశారు. గురువారం తిరుమలాయపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఖమ్మం కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన హక్కులను కాలరాసే చర్యలకు పాల్పడుతుందని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తేనే గిరిజన హక్కులకు మనుగడ ఉంటుందని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని మిషన్ భగీరథ నీళ్లు రాక గిరిజన తండాల్లో ప్రజలు సుదూర ప్రాంతాల బావుల వద్దకు వెళ్లి మంచినీళ్లు తెచ్చుకునే పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే గిరిజన తండాల్లో నీటి ఎద్దడి కొరతను తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన బ్యాక్ లాక్ పోస్టులు భర్తీ చేయాలని, మండల కేంద్రంలో గిరిజన సెల్ఫ్ మేనేజ్‌మెంట్ హాస్టల్ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో గిరిజన సేవాలాల్ సేన మండల కమిటీ అధ్యక్షుడు భూక్య బద్రు నాయక్, గుగులోత్ వీరన్న, గుగులోత్ రవీంద్ర నాయక్, బోడ రంగా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీచైతన్య మహోత్సవం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నేకల్‌లో గల శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం శ్రీచైతన్య మహోత్సవం–24 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం కళాశాలలో జరిగే కార్యక్రమాలే కాకుండా సామాజిక బాధ్యతగా రక్తదానం, అనాథాశ్రమాలు సందర్శన వంటివి చేయడం పలువురికి స్ఫూర్తిదాయకంగా ఉంటాయన్నారు. అలాగే స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ తెలంగాణ సెక్రటరీ పుల్లయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం కలెక్టర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మల్లెంపాడు శ్రీధర్, ఈడీ డాక్టర్ సాయిగీతి, డైరెక్టర్ శ్రీవిద్య, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, సీఈఓ శ్రీనివాస్, ఏఓ వైశాలి, ఉజ్వల్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

'హ్యాపీ కిడ్స్' వార్షికోత్సవం

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో గల కిడ్స్ పాఠశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమవరపు పుల్లారావు, డి.రంగారావు, వెంపటి సురేందర్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

ఖమ్మంరూరల్: స్కిల్ దునియా కంపెనీ నిర్వహించిన ఉద్యోగ నియామకాల్లో మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చి ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ కె.నవీన్ తెలిపారు. గురువారం ప్రతిభ చూపిన విద్యార్థినులను కళాశాలలో అభినందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పోటీ ప్రపంచంలో విద్యార్థినులకు కావాల్సిన సాఫ్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్, మాక్ ఇంటర్వ్యూలు, గ్రూప్ డిస్కషన్స్ వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, అకడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శివపార్వతుల ఊరేగింపు



శివపార్వతుల విగ్రహాలను ఊరేగిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామంలో రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా బుధవారం రాత్రి శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణం జరిగింది. గురువారం ఉదయం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్‌పై గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో నృత్యాలు చేస్తూ ఊరేగించారు. ఈనేపథ్యాన సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యాన పోలీస్ బందోబస్తు చేపట్టారు. నేడు(శుక్రవారం) పూర్ణాహుతి కార్యక్రమం ఉంటుందని ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, బోడేపూడి విఠల్‌రావు, బానోత్ నర్సింహానాయక్, మేకపోతుల మహేశ్‌గౌడ్, మేకల మల్లిఖార్జున్‌రావు, మహేశ్, లక్ష్మీనారాయణ, చల్లా మల్లయ్య, జక్కంపూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు..



రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఏసీపీ తిరుపతిరెడ్డి

తిరుమలాయపాలెం: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి హెచ్చరించారు. మండలంలోని సుబ్లేడ్ క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రిజిస్టర్లను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ వాహనాన్ని కచ్చితంగా తనిఖీలు చేయాలని, నగదు, ఎన్నికల తాయిలాలు ఎట్టి పరిస్థితులలో ఖమ్మం డివిజన్‌లోకి రాకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎంతటి వారైనా తనిఖీలు చేయాల్సిందేనని ఆదేశించారు. ఎన్నికల ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తీరిన తాగునీటి సమస్య..



పైపులైన్ మరమ్మతులు చేపడుతున్న రవినాయక్

కామేపల్లి: మండలంలోని నెమలిపురితండా గ్రామంలో పైపు లైన్, గేటు వాల్ సరిగ్గా లేకపోవడంతో గత 15 రోజులుగా తాగునీటి సమస్య ఏర్పడింది. దీంతో మరమ్మతులు చేపట్టేందుకు పంచాయతీలో నిధులు లేకపోవడంతో అధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేయలేకపోయారు. దీంతో గ్రామస్తుల ఇబ్బందులను తొలగించేందుకు గ్రామానికి చెందిన సపావట్ రవినాయక్ పైపులైన్, గేట్‌వాల్ మరమ్మతులకు సుమారుగా రూ.లక్ష సమకూర్చి సమస్యను పరిష్కరించాడు. గ్రామస్తుల ఇబ్బందులను చూడలేక సహకారాన్ని అందించినట్లు రవినాయక్ తెలిపాడు. అనంతరం పలువురు ఆయనను అభినందించారు.

గిరిజన మత్స్యకారుల సహకార సంఘం ఎన్నిక



అధ్యక్ష, ఉపాధ్యక్షుడు రాందాస్, రాంచందర్

కామేపల్లి: మండలంలోని గోవింద్రాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఎన్నికల అధికారి వరుణ్‌కుమార్ ఆధ్వర్యాన నూతన మత్స్యకారుల సహకార సంఘం పాలకవర్గాన్ని 43 మంది సభ్యులు కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా లకావత్ రాందాస్, ఉపాధ్యక్షుడిగా లకావత్ రాంచందర్, కార్యదర్శిగా మాలోత్ బావ్ సింగ్, డైరెక్టర్లుగా లకావత్ లక్కుపతి, సుక్యా నాయక్, కిషన్, హట్కర్ కిషన్, ఆలోత్ ప్రేమ్‌కుమార్, రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, నాయకులు ఏపూరి మహేందర్, పుచ్చకాయల వీరభద్రం, సొసైటీ డైరెక్టర్లు గుజ్జర్లపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

ఖమ్మం మామిళ్లగూడెం: దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా ముత్తినేని వీరయ్య నియమకం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటామని కాంగ్రెస్ దివ్యాంగుల జిల్లా అధ్యక్షుడు కుంచం ఉప్పలయ్య అన్నారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ కేక కట్ చేశారు. ఈ కార్యక్రమంలో దోతల చైతన్య, మరికంటి నాగేశ్వరావు, చెరుకుపల్లి శ్రీను, రవి, సుమన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల చదువు బాధ్యత తల్లిదండ్రులదే..

ఖమ్మం సహకారనగర్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో పిల్లల చదువు బాధ్యతంతా పాఠశాలదే అన్నట్లుగా.. కొద్దిమంది తల్లిదండ్రులు భావిస్తున్నారని, మొదటిగా గురువులు, ఆ తర్వాత తల్లిదండ్రులదని గుర్తించాలని ప్రముఖ శిశు వైద్యురాలు యలమంచిలి నాగమణి పేర్కొన్నారు. గురువారం నగరంలోని శ్రీరామకృష్ణ విద్యాలయంలో శిశువాటిక తరగతులపై తల్లిదండ్రులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా పాల్గొన్న ఆమె పలు సూచనలు చేశారు. అనంతరం కోవెల శ్రీనివాసాచార్యులు, ఎన్‌ఈపీ–2020 గురించి వివరించారు. సదస్సులో ప్రిన్సిపాల్ సంతోష గౌతమ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏవీఎస్‌కు ఘన నివాళి

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవడం కోసం పోరాటాలు చేయడమే ఉపాధ్యాయ ఉద్యమ ఆదర్శనేత అప్పారి వెంకటస్వామి(ఏవీఎస్)కి మనమిచ్చే ఘనమైన నివాళి అని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం నగరంలోని సంఘం కార్యాలయంలో యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి 23వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడగా..పౌరసత్వ సవరణ చట్టం– పరిణామాలు అనే అంశంపై ప్రముఖ న్యాయవాది జక్కంపూడి నాగేశ్వరరావు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో మహబూబ్ అలీ, బండి నర్సింహారావు, రాందాస్, బుర్రి వెంకన్న, షమీ, రాంబాబు, రంజాన్, గీత, సురేష్, షరీఫ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

నేలకొండపల్లి: ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రావెళ్లభవన్‌లో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు విక్రయించేందుకు కేంద్రాలు లేకపోవడంతో దళారులను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ధాన్యానికి గతంలో రూ.2550 చెల్లించి, ప్రస్తుతం మిల్లర్లు, దళారులు కుమ్మక్కై రూ.2,000 నుంచి రూ. 2,200 వరకు మాత్రమే ఇస్తున్నారని, మిల్లర్ల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి, కట్టెకోల వెంకటేశ్వర్లు, బెల్లం లక్ష్మి, దుగ్గి వెంకటేశ్వర్లు, ఏటుకూరి రామారావు, సామాల మల్లిఖార్జున్‌రావు, ప్రకాశ్, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాం

ఖమ్మంరూరల్: ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి పొంగులేటి మాధురి తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఆమె పర్యటించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ మేరకు పలు కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, తిప్పిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, తమ్మినేని నవీన్, అశోక్, కిశోర్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు..



పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాసరావు

నేలకొండపల్లి: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని సీపీఐ మండల సహాయ కార్యదర్శి పాల్తీయ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని మంగాపురంలో వివిధ పార్టీల నుంచి సీపీఐలో గురువారం చేరగా.. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై దశల వారీగా ఉద్యమాలు చేయనున్నట్లు తెలిపారు. చెరువుమాదారం చెరువు ఇంకిపోవటానికి ఇరిగేషన్ అధికారులే కారణమన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ సత్తా చాటేందుకు కార్యాచరణను రూపొందిస్తామని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బి.వెంకటేశ్వర్లు, గుగులోత్ వెంకటేశ్వర్లు, అంజయ్య, బ్రహ్మం, సైదులు తదితరులు పాల్గొన్నారు.